క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



క్రీడాకారులను అభినందిస్తున్న హెచ్ఎం గీతా

కోవెలకుంట్ల: స్థానిక సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల విద్యార్థులు వివిధ క్రీడల్లో రాణించి రాష్ట్ర, జిల్లాస్థాయి పోటీలకు ఎంపికై నట్లు హెచ్ఎం గీతా తెలిపారు. సెప్టెంబర్ 30వ తేదీ నంద్యాలలో జరిగిన జిల్లాస్థాయి తైక్వాండో పోటీల్లో 9వ తరగతి విద్యార్థిని శాన్విత సత్తా చాటిందన్నారు. జిల్లా స్థాయిలో రాణించడమే కాకుండా ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు తిరుపతిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. అలాగే నియోజకవర్గస్థాయి వాలీ బాల్, బాల్‌బ్యాడ్మింటన్, చెస్ పోటీల్లో సంతోష్, మణికంఠ, హనీఫ్, గగన ప్రతిభ చాటి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికై నట్లు వెల్లడించారు. విద్యార్థులను అభినందించారు.

టాలెంట్ టెస్టులో విద్యార్థుల ప్రతిభ



బహుమతులను అందజేస్తున్న ప్రిన్సిపాల్

కొలిమిగుండ్ల: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక మోడల్ స్కూల్‌లో మంగళవారం మండల స్థాయి చకుముకి సైన్స్ టాలెంట్ టెస్టు నిర్వహించారు. మోడల్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఆఫ్రీఫ్, వసుంధర, మహమ్మద్ షరీఫ్ ప్రతిభ చూపినట్లు ప్రిన్సిపాల్ సంజీవ రెడ్డి తెలిపారు. అలాగే అండర్-17 హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేంపల్లెలో నిర్వహించిన పోటీల్లో పాఠశాల విద్యార్థులు ఉదయ్, శ్రీనివాసులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. పీఈటీ గంగావతిని అభినందించారు.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం

సంజామల: మండల పరిధిలోని కానాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎస్‌జీఎఫ్ నియోజకవర్గస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం అరుణకుమారి తెలిపారు. ఇటీవల బనగాపపల్లె మండలం నందవరం పాఠశాలలో జరిగిన నియోజకవర్గ స్థాయి అండర్ 14,17 విభాగాల్లో తమ విద్యార్థులు వివిధ క్రీడాంశాల్లో సత్తా చాటారని చెప్పారు. విద్యార్థులతో పాటు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు చిన్న మౌలాలిని అభినందించారు.

ఉపాధ్యాయుడికి సన్మానం



ప్రతాప్‌ను సన్మానిస్తున ఉపాధ్యాయులు

బనగానపల్లె: గత నెల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న ఎన్.ప్రతాప్‌ను పట్టణంలోని కస్బా ఎంపీపీ పాఠశాలలో హెచ్ఎం సుంకన్న, ఉపాధ్యాయులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథులుగా ఎంఈఓలు స్వరూప, శ్రీనివాసులు ప్రసంగించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు సత్య ప్రకాష్, దస్తగిరి, ఉపాధ్యాయులు అబ్దుల్‌కలీం, పుష్పలత, లక్ష్మీదేవి, కృష్ణయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

డ్రాయింగ్‌లో ద్వితీయ స్థానం



విద్యార్థిని శ్రీకృతిని అభినందిస్తున్న దృశ్యం

డోన్ టౌన్: పట్టణంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో 4వ తరగతి చదువుతున్న శ్రీకృతి డ్రాయింగ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఉమ్మడి కర్నూలు జిల్లాలో ద్వితీయ స్థానం సంపాదించింది. సెప్టెంబర్ 26వ తేదీ బీఎస్ఎన్ఎల్ ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రాయింగ్ పోటీల్లో ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి 35 స్కూళ్లకు చెందిన 3,098 మంది విద్యార్థులు హాజరయ్యారు. శ్రీకృతి ద్వితీయ బహుమతి గెలుచుకుంది. ఈ మేరకు మంగళవారం స్కూల్ యాజమాన్యం విద్యార్థినిని అభినందిస్తూ ప్రోత్సాహక బహుమతి అందజేసింది.

బట్టల దుకాణంలో చోరీ

ఆళ్లగడ్డ: పట్టణంలోని బట్టదుకాణంలో చోరీ జరిగింది. కందుకూరు రహదారిలోని మదీనా శారీ సెంటర్ యజమాని అబుద్దాల్లా రోజు మాదిరి వ్యాపారం ముగించుకుని సోమవారం రాత్రి దుకాణం మూసి ఇంటికి పోయారు. మంగళవారం దుకాణం తెరుచేందుకు రాగా తాళాలు తెరిచి ఉంది.. లోపలికి వెళ్లి చూడగా రూ.65 వేల నగదు, కమ్మలు, ఉంగరాలు దోపిడీకి గురయ్యాయని బాధితుడు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పట్టణ సీఐ చిరంజీవి తెలిపారు.

హోదా నిల్.. అధికారం ఫుల్

- ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులను కాదని పచ్చ నేతలకు ప్రాధాన్యం
- అధికార పార్టీ నేతలను అందలం ఎక్కిస్తున్న మున్సిపల్ కమిషనర్
- టీడీపీ నాయకుల కనుసన్నల్లో వివాదాస్పద నిర్ణయాలు
- ఆయన తీరుపై మండిపడుతున్న కౌన్సిలర్లు



ప్రభుత్వ కార్యక్రమ వేదికపై ప్రైవేటు వ్యక్తులతో మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్

డోన్: డోన్ మున్సిపాలిటీ నూతన కమిషనర్ ప్రసాద్‌గౌడ్ పదవీ బాధ్యతలు చేపట్టి పది రోజులు కాకముందే వివాదాస్పద నిర్ణయాలతో విమర్శలు ఎదుర్కొంటున్నారు. స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులతో పాటు విద్యాసంస్థల అధినేత సిఫార్సుతో ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, కమిషనర్‌గా ప్రసాద్‌గౌడ్ పేరును సిఫార్సు చేశారు. దీంతో మొట్ట మొదటిసారిగా జరిగిన గృహనిర్మాణశాఖ నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, వైస్ చైర్మన్‌లు కోట్రికె హరికిషన్, జాకీర్ హుసేన్‌లను కాదని తనకు పదవి రావడానికి కారణమైన వ్యక్తితో పాటు కూటమి నాయకులను సమావేశానికి ఆహ్వానించారు. దీంతో అధికార పార్టీలోనే మరో వర్గం కమిషనర్ తీరును తీవ్రంగా వ్యతిరేకించింది. ప్రజాప్రతినిధులు కాని వ్యక్తులను ప్రభుత్వ కార్యక్రమాల వేదికలపైకి ఎలా ఆహ్వానిస్తారని అధికార పార్టీ నాయకులే కమిషనర్‌ను ప్రశ్నిస్తున్నారు. ఇది ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని మండిపడుతున్నారు.

మున్సిపల్ సమావేశంలోనూ అదే తీరు

గత మూడున్నరేళ్లుగా ఎంతో సవ్యంగా జరిగిన మున్సిపల్ సర్వసభ్య సమావేశం కమిషనర్‌గా ప్రసాద్‌గౌడ్ బాధ్యతలు తీసుకున్న పది రోజుల్లోనే కౌన్సిలర్ల మధ్య తగాదాలకు దారితీసింది. చైర్మన్ ప్రమేయం లేకుండానే అజెండాలో ప్రైవేటు వ్యక్తుల ప్రోద్బలంతో అనేక అంశాలను చేర్చడం వివాదానికి కారణమైంది. ఫలితంగా సోమవారం జరిగిన మున్సిపల్ సమావేశం రసాభాసగా మారింది. ప్రజాప్రతినిధులను అగౌరపరచడం సరైన పద్ధతి కాదని పలువురు పెదవి విరుస్తున్నారు. ఆయా వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కౌన్సిలర్లను అడిగి తెలుసుకుని అజెండాలో చేర్చకపోవడం కమిషనర్ చేసిన పెద్ద తప్పిదమని ప్రజలు కూడా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులను కాదని అధికార పార్టీ నాయకులు చెప్పినట్లు చేయడం మంచి పద్ధతి కాదని హితవు పలుకుతున్నారు. విధి నిర్వహణలో గత మున్సిపల్ కమిషనర్ల మాదిరిగా నిక్కచ్చిగా వ్యవహరించి ప్రజా మన్ననలు పొందాలని పేర్కొంటున్నారు. మొత్తానికి వచ్చీరాగానే వివాదాస్పద వ్యక్తిగా, అధికార పార్టీ సేవకుడిగా ముద్ర వేసుకున్న కమిషనర్ ముమ్ముందు ఎలా వ్యవహిస్తారనే చర్చ జరుగుతోంది.

శాస్త్రీయ విజ్ఞానంతోనే దేశాభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి తంగమణి

డోన్ టౌన్: శాస్త్రీయ విజ్ఞానంతోనే దేశాభివృద్ధి సాధ్యం అవుతుందని సీనియర్ సివిల్ జడ్జి తంగమణి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జరిగిన మండల స్థాయి చెకుముకి సైన్స్ పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. శాస్త్రీయ దృక్పథంతో విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, నవ సమాజ నిర్మాణంలో విద్యార్థులు పాలుపంచుకోవాలని సూచించారు. అపజయాలే విజయానికి సోపానాలని తెలిపారు. పోటీ పరీక్షలు రాయడం వల్ల సృజనాత్మకత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారులు ప్రభాకర్, రామనర్సప్ప, సీఐ ఇంతియాజ్‌బాషా, జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యంశెట్టి, ఉపాధ్యాయులు వెంకటసుబ్బారెడ్డి, ఎస్ఎస్ బాబు, రమణ, మౌలాలీ, నరసింహారెడ్డి, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళం

ప్యాపిలి: మండల పరిధిలోని పలు ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు విజయవాడ వరద బాధితుల కోసం విరాళాలు సేకరించారు. పట్టణానికి చెందిన శారద విద్యాలయం విద్యార్థులు సేకరించిన రూ. 10 వేలను కరస్పాండెంట్ అరుణ మంగళవారం యూపీఎస్ఎఫ్ స్టేట్ డైరెక్టర్ చంద్రశేఖర్, నాయకులు అక్బర్, పురుషోత్తంకు అందజేశారు. అలాగే శ్రీలక్ష్మి పాఠశాల తరఫున రూ.8,220, జ్యోత్స్న పాఠశాల రూ.5,300, ఆదిత్య పాఠశాల రూ.3,113, లక్ష్మిరెడ్డి పాఠశాల రూ. 3,000, శివజ్యోతి రూ. 2,500 చొప్పున ఆయా పాఠశాలల కరస్పాండెంట్‌లు యూనియన్ నాయకులకు అందజేశారు.

- **బనగానపల్లె రూరల్:** మండలంలోని పలు ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు సేకరించిన రూ.42 వేల చెక్కును ఆయా పాఠశాలల కరస్పాండెంట్‌లు క్యాంపు కార్యాలయంలో మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డికి అందజేశారు. వారికి మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

పింఛన్ల పంపిణీ



నందవరంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి బీసీ

బనగానపల్లెరూరల్: మండలంలోని నందవరం గ్రామంలో రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి మంగళవారం లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. రాష్ట్రంలో ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఒకటో తేదీ పింఛన్లను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. మండలంలో మొత్తం 12,463 మంది లబ్ధిదారులు ఉండగా 97 శాతం పంపిణీ పూర్తి చేసినట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగరాజు తెలిపారు. మండల ప్రత్యేక అధికారి సుబ్బారెడ్డి, వెలుగు ఏపీఎం శ్రీనివాసులు, ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ ఉమామహేశ్వమ్మ, పీఆర్ డీఈఈ నాగశ్రీనివాసులు, ఏఈ రమణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు ముస్తాబు



బేతంచెర్ల అమ్మవారిశాల వద్ద ఏర్పాట్లు

బేతంచెర్ల: దసరా నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని పట్టణంలోని అమ్మవారిశాల, చెన్నకేశవ, వేంకటేశ్వరస్వామి, చౌడేశ్వరిదేవి ఆలయాలు ముస్తాబవుతున్నాయి. ఆయా ఆలయాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరిస్తున్నారు. అమ్మవారిశాల ఎదుట అమ్మవారి సెట్టింగ్‌కు ఏర్పాటు చేస్తున్నారు. అలాగే బనగానపల్లె రహదారిలోని పుట్టపెద్దమ్మ ఆలయంలో ఉత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకుడు రామకృష్ణ తెలిపారు.

రేపటి నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు



వాసవీ కన్యకాపరమేశ్వరి

కోవెలకుంట్ల: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో గురువారం నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పెండేకంటి సుబ్రమణ్యం తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 11 రోజుల పాటు ఉత్సవాలు కొనసాగుతాయన్నారు. మొదటి రోజు అమ్మవారు రాజరాజేశ్వరీదేవి, 4న గాయత్రీదేవి, 5న గజలక్ష్మీ, 6న ధనలక్ష్మీ, 7వ తేదీ సంతాన లక్ష్మీ, 8న బాలత్రిపుర సుందరిదేవి, 9న సరస్వతీదేవి, 10న మహిషాసురమర్దిని, 11న అన్నపూర్ణదేవి, 12న విజయదశమి, శమీదర్శనం, గ్రామోత్సవం, తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. 13 తేదీ తులాభారం, తొట్ల ఉత్సవం, పాన్పుసేవ కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయని వెల్లడించారు.

సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు

కోవెలకుంట్ల: రబీ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు అందజేస్తున్నట్లు ఉద్యానవన శాఖ అధికారిణి ధరణి తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. క్రిమి సంహారక మందులు పిచికారీ చేసే తైవాన్ స్ప్రేయర్లు అందుబాటులో ఉన్నాయన్నారు. స్ప్రేయర్లు కావాల్సిన రైతులు రూ. 22,500 బ్యాంకు ద్వారా డీడీ తీసి అందజేయాలన్నారు. ఇందులో రూ. 10 వేలు తిరిగి రైతు ఖాతాలో జమ అవుతుందన్నారు. అలాగే పవర్ టిల్లర్, చిన్న ట్రాక్టర్లను సబ్సిడీపై రైతులకు సరఫరా చేస్తామన్నారు. వివరాలను స్థానిక ఉద్యానవన శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు.

ముందస్తు దసరా వేడుకలు



దుర్గామాత వేషాధారణలో చిన్నారులు

డోన్ టౌన్: స్థానిక భాష్యం పాఠశాలలో ముందస్తు దసరా వేడుకలను మంగళవారం నిర్వహించారు. విద్యార్థులు వివిధ వేషధారణలతో ఆకట్టుకున్నారు. దసరా పండుగ విశిష్టతను స్కూల్ ప్రిన్సిపాల్ సాయినాథ్ వివరించారు. విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

చెకుముకి విజేతలకు బహుమతుల ప్రదానం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

ప్యాపిలి: మండల పరిధిలోని 13 పాఠశాలల్లో మంగళవారం మండల స్థాయి చెకుముకి పరీక్షలు నిర్వహించారు. ప్యాపిలి బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఎస్ఐ శ్రీనివాసులు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. మూఢ నమ్మకాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు చుకుముకి పరీక్షలు నిర్వహించడం అభినందనీయమన్నారు. మండల స్థాయిలో ప్యాపిలి బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు శ్రీకృష్ణ, హర్షవర్ధన్, మహమ్మద్ ప్రథమ స్థానంలో నిలిచినట్లు, హుసేనాపురం, జలదుర్గం విద్యార్థులు వరుసగా ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచినట్లు తెలిపారు. జనవిజ్ఞాన వేదిక డోన్ డివిజన్ అధ్యక్షుడు సర్వజ్ఞమూర్తి, నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు అబ్దుల్ లతీఫ్, శాంతిప్రియ, యూటీఎఫ్ నాయకులు కృష్ణానాయక్, రమేష్ నాయుడు, నెల్లూరప్ప, శాంతికుమార్ పాల్గొన్నారు.

తెరుచుకోని మద్యం దుకాణాలు

బనగానపల్లె రూరల్: మద్యం దుకాణాల్లో పనిచేసే ఉద్యోగులకు ప్రభుత్వం ఎలాంటి హామీ ఇవ్వకపోవడంతో మంగళవారం నుంచి విధులు బహిష్కరించారు. దీంతో మండలంలో మద్యం దుకాణాలు మూతపడ్డాయి. మద్యం షాపులు తెరుచుకోకపోవడంతో మద్యం ప్రియులు దుకాణాల వద్ద ఎదురు చూశారు. ప్రభుత్వ పనితీరుపై విమర్శలు గుప్పించారు. మంగళవారం అమావాస్య కావడం, స్వర్గస్తులైన పెద్దలకు కుటుంబ సభ్యులు పూజలు చేయాల్సి ఉండడంతో మద్యం కోసం ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరోవైపు బ్లాక్‌లో మాత్రం మద్యం ఇష్టానుసారం విక్రయించారు. దీనిపై బనగానపల్లె ఎక్సైజ్‌శాఖ సీఐ వర్ధనదేవి స్పందిస్తూ బనగానపల్లె మండలంలో కొన్ని మద్యం దుకాణాలను తెరిచే ప్రయత్నం చేస్తామని తెలిపారు.



నందవరంలో మూతబడిన మద్యం దుకాణం

సేవకు సత్కారం



కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న రవికుమార్

బేతంచెర్ల: జిల్లా వ్యాప్తంగా రక్తదాన శిబిరాలు, ఆపద సమయంలో దాతలకు రక్తం సమకూరుస్తున్న బేతంచెర్ల లైఫ్ యువనేత్ర సమితికి కలెక్టర్ రాజకుమారి ప్రశంసా పత్రం అందజేశారు. మంగళవారం జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా నంద్యాలలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉత్తమ రక్తదాతలకు అవార్డుల ప్రదాన కార్యక్రమం జరిగింది. లైఫ్ యువనేత్ర సేవా సమితి తరపున రంగారెడ్డి, రవీంద్రారెడ్డి, పవన్ కుమార్, నాగ సురేంద్రగౌడ్, 113 సార్లు రక్తదానం చేసిన లింగాల రవికుమార్‌కు జిల్లా కలెక్టర్ రాజకుమారి, రెడ్ క్రాస్ చైర్మన్ దస్తగిరి, స్టేట్ కమాండెంట్ అరవింద్ సింగ్, రామకృష్ణారెడ్డి చేతుల మీదుగా అవార్డులు అందజేశారు.

నేడు గాంధీ జయంతి వేడుకలు

కోవెలకుంట్ల: పట్టణంలో బుధవారం నిర్వహించ తలపెట్టిన మహాత్మాగాంధీ జయంతి వేడుకలను విజయవంతం చేయాలని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పెండేకంటి సుబ్రమణ్యం కోరారు. గాంధీజీ జయంతిని పురస్కరించుకుని స్థానిక అమ్మవారిశాల ఆవరణలోని జాతిపిత విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తామని తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

పంట నమోదు పరిశీలన



పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

బేతంచెర్ల: మండల కేంద్రంలో పంట నమోదు ప్రక్రియను జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ, డోన్ వ్యవసాయశాఖ ఏడీఏ అశోక్‌వర్ధన్ రెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. పంట నమోదును పారదర్శకంగా నమోదు చేయాలని అగ్రికల్చర్ అసిస్టెంట్స్‌కు సూచించారు. క్షేత్ర స్థాయిలో పంటల సాగు, నమోదు చేసిన వివరాలు సరిగ్గా ఉన్నాయా అని పరిశీలించారు. వారి వెంట ఏఓ కిరణ్ కుమార్, అగ్రికల్చర్ అసిస్టెంట్ సద్దామ్ హుస్సేన్ ఉన్నారు.

పంట నమోదు రికార్డుల పరిశీలన



పంట నమోదు రికార్డులను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

డోన్ రూరల్: మండల పరిధిలోని కొచ్చెర్వు, వెంకటనాయునిపల్లి గ్రామాల్లో జరుగుతున్న పంట నమోదు సూపర్ చెక్ రికార్డులను మంగళవారం జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, డోన్ సహాయ వ్యవసాయ సంచాలకుడు పి.అశోక్‌వర్ధన్ రెడ్డి పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడారు. తగిన సమయంలో పంటలకు మందులు పిచికారీ చేసుకోవాలని సూచించారు. ఎప్పటికప్పుడు వ్యవసాయాధికారుల సూచనలు పాటిస్తూ అధిక దిగుబడులు సాధించాలన్నారు. పంట విషయంలో ఎలాంటి సమస్య ఉన్నా గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలన్నారు. వారి వెంట మండల వ్యవసాయ అధికారి అబ్దుల్‌షఫీ ఉన్నారు.

నిరుపయోగం.. దృష్టి పెడితే ఎంతో ఉపయోగం



కొలుములపల్లెలో నిరుపయోగంగా ఉన్న గ్రామ సచివాలయం, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం, రైతు భరోసా కేంద్రం

బేతంచెర్ల: గ్రామస్థాయిలోనే ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బేతంచెర్ల మండల పరిధిలోని కొలుములపల్లె గ్రామంలో రూ.40 లక్షలతో గ్రామ సచివాలయం, రూ.17.50 లక్షలతో ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం, రూ.21.80 లక్షలతో రైతు భరోసా కేంద్రం నిర్మించింది. ఈ ఏడాది ఫిబ్రవరి 8వ తేదీ ఈ భవనాలను ప్రజాప్రతినిధులు, మండల అధికారులు ప్రారంభించారు. భవనాలు ప్రారంభించి 7 నెలలు అవుతున్నా ఉపయోగంలోకి తీసుకునిరాలేదు. రాత్రి వేళల్లో ఆ భవనాల వద్ద ఆకతాయిలు, గుర్తు తెలియని వ్యక్తులు మద్యం సేవిస్తున్నారు. అసాంఘిక కార్యకలపాలకు అడ్డగా మార్చేశారు. మూడు శాఖల భవనాలు ఒకే చోట ఉండడం వల్ల ప్రజలకు ఎంతో ఉపోయోగకరంగా ఉంటుందని అప్పటి ప్రభుత్వం వీటిని నిర్మించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అధికారులు వీటిపై దృష్టి సారించడం లేదు. మూడు భవనాలను వినియోగంలోకి తేవడం వల్ల ప్రజలతో పాటు ఉద్యోగులకు సౌకర్యంగా ఉంటుంది. ఇప్పటికైనా మండల అధికారులు స్పందించి గ్రామ సచివాలయం, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం, రైతు భరోసా కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకునిరావాలని స్థానికులు కోరుతున్నారు.



ఆవరణలో పడి ఉన్న మద్యం బాటిళ్లు

రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలి



లింగాలలో పంటలను పరిశీలిస్తున్న అధికారులు



మాట్లాడుతున్న వెటర్నరీ ఏడీ వసంతలక్ష్మి

కోవెలకుంట్ల: పంటల సాగులో రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలని మండల వ్యవసాయాధికారి నిరంజన్ రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని లింగాల, రేవనూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వివిధ పంటల్లో యాజమాన్య పద్ధతులు, తెగుళ్లు, పురుగుల నివారణ, ఈ-పంట నమోదు, భూసార పరీక్షల ఆవశ్యకత, తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. క్షేత్రస్థాయిలో వివిధ పంటలను పరిశీలించి అధిక దిగుబడుల సాధనకు రైతులకు సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం ఏఓ మాట్లాడుతూ.. రబీ సీజన్ ప్రారంభమైన దృష్ట్యా రైతులు డీఏపీ ఎరువుకు బదులు ఇతర కాంప్లెక్స్ ఎరువులు వినియోగించుకోవచ్చన్నారు. ఉద్యానవన శాఖ అధికారిణి ధరణి, పశువైద్యాధికారిణి విజయలక్ష్మి, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వరిలో యాజమాన్య పద్ధతులపై అవగాహన



రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయ అధికారి

అవుకు: వరి సాగు చేసిన రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు సాధ్యమని వ్యవసాయ అధికారి అబ్దుల్ హక్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని శింగనపల్లె, అవుకులో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అవుకు రిజార్వాయర్‌లో నీరు పుష్కలంగా ఉండడంతో పాటు వర్షాలు కురువడంతో వరి అధికంగా సాగైందని తెలిపారు. వరిలో ఆశించే తెగుళ్ల నుంచి పంటను రక్షించుకోవాలన్నారు. పంటల్లో మందుల పచికారీకి డ్రోన్ పరిజ్ఞానాన్ని రైతులకు వివరించారు. అనంతరం మట్టి నమూనా పరీక్ష కార్డులను రైతులకు పంపిణీ చేశారు.

కందిలో సస్యరక్షణ చర్యలు అవసరం

బేతంచెర్ల: ఖరీఫ్‌లో సాగుచేసిన కంది పంటలో అధిక దిగుబడుల కోసం సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏఓ కిరణ్ కుమార్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గోర్లగుట్ట, బేతంచెర్ల-1 సచివాలయంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కంది పంటలో వచ్చే ఎండు తెగులు, గూడు పురుగు తెగులు నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. అలాగే వెటర్నరీ ఏడీ వసంత లక్ష్మి పశుసంవర్ధకశాఖ తరపున అందిస్తున్న ప్రోత్సాహాన్ని వివరించారు.

యాగంటి క్షేత్రానికి రూ.3.84 లక్షల ఆదాయం

నంద్యాల(రూరల్): టూరిస్ట్ డార్మెటరీ వేలం ద్వారా యాగంటి క్షేత్రానికి రూ.3.84 లక్షల ఆదాయం సమకూరింది. మంగళవారం కలెక్టరేట్‌లోని ఏపీ టూరిజం కార్యాలయంలో యాగంటి క్షేత్రం వద్ద ఉన్న టూరిస్ట్ డార్మెటరీకి బహిరంగ వేలం పాట నిర్వహించారు. ముగ్గురు పోటీదారులు పాల్గొనగా బనగానపల్లెకు చెందిన మలికిరెడ్డి దస్తగిరి రెడ్డి అత్యధికంగా రూ.3,84,680కు పాట పాడి దక్కించుకున్నారు. రెస్టారెంట్, పరిసరాలను అభివృద్ధి చేసి పర్యాటకులకు వసతులు ఏర్పాటు చేసి డార్మెటరీని నిర్వహించుకోవాలని పర్యాటక శాఖాధికారి సత్యనారాయణ తెలిపారు.

విద్యార్థులకు క్రమశిక్షణ ముఖ్యం

సంజామల: విద్యార్థులకు విద్యతో పాటు క్రమశిక్షణ ముఖ్యమని, బాగా చదువుకుని తల్లిదండ్రుల కళలను సాకారం చేయాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సరళాదేవి అన్నారు. మంగళవారం సంజామల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల తల్లితండ్రులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. విద్యార్థులు ప్రతి రోజు కళాశాలకు వస్తున్నారా లేదా అని గమనించాలని సూచించారు. విద్యార్థులను క్రమం తప్పకుండా కాలేజీకి పంపించాలని కోరారు. ఇంట్లో, బయట విద్యార్థులు ఏం చేస్తున్నారని ఓ కంటి కని పెట్టి ఉండాలన్నారు.